

కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించాలి: కలెక్టర్

పార్వతీపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో విధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను నిర్వహించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో సిబ్బందిని ఆదేశించారు. మండల స్థాయిలో కూడా ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించాలని పేర్కొన్నారు. అర్జీదారులు 1100 నెంబర్‌కు ఫోన్ చేసి పీజీఆర్ఎస్ వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. మీకోసం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అర్జీల నమోదు, వాటి స్థితి, దానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

ప్రమాదమైనా.. తప్పని పడవ ప్రయాణం

- వంశధారకు స్వల్ప వరద
- ఆంధ్రా-ఒడిశా గ్రామస్థులకు ఇబ్బందులు

భామిని, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతం ఒడిశాతో పాటు జిల్లాలో కూడా వర్షాలు కురుస్తుండడంతో భామిని మండల పరిధిలోని వంశధారకి వరద పోటెత్తుతోంది. నదిలో స్వల్పంగా నీటి నిల్వలు పెరిగాయి. దీంతో నదిలో దిగి వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో ఆంధ్రా, ఒడిశా నదీతీర గ్రామాలు ప్రజలు పడవను ఆశ్రయిస్తున్నారు. నేరడి గురండి, బిల్లుమడ, సింగిడి, వడ్డంగి, లోహజోల తదితర గ్రామస్థులు నేరడి తీరం పడవ ఎక్కి నది అవతల ఉన్న ఒడిశా గ్రామాలకు వెళ్తున్నారు. అదేవిధంగా ఒడిశా గ్రామాలైన ఖండవ, పురిటిగూడ, గౌరి గ్రామస్థులు అదే పడవపై తిరిగి ఆంధ్రా వైపు వస్తున్నారు. గుణుపూర్, పూరి, విశాఖ రైళ్ల కోసం స్టేషన్‌కు వెళ్లాల్సిన వారు కూడా ఇదే విధంగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వేసవిలో ఎటువంటి ఇబ్బందులు లేకపోయినప్పటికీ ఏటా వర్షాకాలంలో మాత్రం అవస్థలు తప్పడం లేదు. వాస్తవంగా నేరడి రేవు నుంచి మూడు నుంచి ఐదు కిలోమీటర్లు పడవలో ప్రయాణిస్తే ఆంధ్రా-ఒడిశా గ్రామాలకు చేరుకో వచ్చు. అదే రోడ్డు మార్గం అయితే కొత్తూరు, బత్తిలి మీదుగా 50 కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. రవాణా ఖర్చుతో పాటు సమయం కూడా వృథా అవు తుంది. దీంతో పడవ ప్రయాణం వైపే ప్రయాణికులు మొగ్గు చూపుతున్నారు. అయితే గతంలో ప్రమాదాలు జరిగిన నేపథ్యంలో కొంతమంది భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపాదనలకే పరిమితమైన నేరడీ బ్యారేజీని నిర్మిస్తే ఈ కష్టాలు తప్పుతాయని ఆయా ప్రాంత వాసులు చెబుతున్నారు. దీనిపై ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు స్పందించాలని కోరుతున్నారు.



పడవ దిగి వస్తున్న ప్రయాణికులు



నేరడి వంశధార రేవులో పడవ ప్రయాణం చేస్తున్న గ్రామస్థులు

కదలవు.. వదలవు!

- చినబగ్గ అటవీ ప్రాంతంలో ఏనుగులు



జీడితోటల్లో సంచరిస్తున్న ఏనుగులు

సీతంపేట రూరల్, జూలై6 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యాన్ని గజరాజులు వీడడం లేదు. నిన్నమొన్నటి వరకు గోరపాడు సమీపంలో సంచరించిన ఏనుగులు ఆదివారం చినబగ్గ అటవీ ప్రాంతంలోని జీడితోటల్లో దర్శనమిచ్చాయి. దీంతో ప్రాంత రైతులు, గ్రామస్థులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల సంచారం వల్ల కొండపోడు, పైనాపిల్, అటవీ ఉత్పత్తుల సేకరణకు వెళ్లలేకపోతున్నట్లు గోరపాడు, మోహనకాలనీ, చినబగ్గకాలనీకి చెందిన గిరిజనులు వాపోతున్నారు. అవి ఎటువైపు నుంచి వచ్చి దాడి చేస్తాయో తెలియక బయటకు వెళ్లలేకపోతున్నామని చెబుతున్నారు. చీకటి పడితే ఆరుబయటకు వెళ్లలేక.. ఇళ్లలోనే బిక్కుబిక్కు మంటూ ఉండాల్సి వస్తోందన్నారు. తక్షణమే ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. నాలుగు ఏనుగులను రోజూ అటవీశాఖ సిబ్బంది, ట్రాకర్స్ పర్యవేక్షిస్తున్నారని, ప్రజలను అప్రమత్తం చేస్తున్నారని ఫారెస్ట్ బీట్ అధికారి దాలినాయుడు తెలిపారు.

రైతులకు ఏ కష్టం రానివ్వం

- వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట
- శివారు భూములకూ సాగునీరందిస్తాం
- నిర్వాసితుల త్యాగాలు మరువలేనివి
- జంఝావతి సమస్య పరిష్కారానికి కృషి
- లస్కర్ల నియామకానికి చర్యలు
- మంత్రి సంధ్యారాణి
- తోటపల్లి ద్వారా సాగునీరు విడుదల



తోటపల్లి నీటి విడుదలకు స్విచ్ ఆన్ చేస్తున్న మంత్రి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ జగదీశ్వరి

పార్వతీపురం/గరుగుబిల్లి, జూలై6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్నదాతలకు ఏ కష్టం రానివ్వబోమని మంత్రి సంధ్యారాణి తెలిపారు. శివారు భూములకూ సాగునీరందిస్తామన్నారు. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర ప్రాంతంలోని తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు ద్వారా ఆదివారం సాగునీరు విడుదల చేశారు. నాగావళి నదికి జలహారతి ఇచ్చి.. ఖరీఫ్‌లో పంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'వ్యవసాయానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. రైతన్నల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోంది. 2013లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తోటపల్లి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేసి పనుల వేగవంతానికి చర్యలు తీసుకున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించింది. పెండింగ్ పనుల పూర్తిగా భారీగా నిధులు మంజూరు చేస్తోంది. తోటపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి ఈ ప్రాంత రైతులు చేసిన త్యాగాలు మరువలేం. వారి వల్లే ఉత్తరాంధ్ర సస్యశ్యామలంగా ఉంది. పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో కుడి ప్రధాన కాలువ నుంచి 1,31,221 ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతుంది. తొలుత 17 మండలాల పరిధిలోని చెరువుల కోసం సాగునీరు విడుదల చేశారు. తోటపల్లి పాత రెగ్యులేటర్ పరిధిలోని కుడి, ఎడమ కాలువల నుంచి 64 వేల ఎకరాలకు నీరు సరఫరా చేసేందుకు యంత్రాంగం చర్యలు చేపడుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌డీఎంఎఫ్ గ్రాంట్ కింద కుడి ప్రధాన కాలువలో జంగిల్ క్లియరెన్స్, పూడిక తీత పనులు చేపట్టింది. ఈ ఆర్థిక సంవత్సరంలో పనులు చేపట్టేందుకు రూ. 67 లక్షలు మంజూరు చేసింది.' అని తెలిపారు.



కాలువలోకి నీటి పరవళ్లు

సీఎం దృష్టికి జంఝావతి సమస్య..

'జంఝావతి ప్రాజెక్టు సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లాం. ఒడిశా ముఖ్యమంత్రితో చర్చలు జరిపేందుకు చర్యలు చేపడుతున్నాం. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో తోటపల్లి, జంఝావతి ప్రాజెక్టులపై చిన్న చూపు చూసి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రెండు ప్రాజెక్టుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసింది. కొద్ది రోజుల్లో పూర్ణపాడు-లాబేసు వంతెన పనులు పూర్తికానున్నాయి.' అని మంత్రి వెల్లడించారు. లస్కర్ల నియామకానికి ప్రతిపాదనలను (మిగతా 8వ పేజీలో..)

పాడి అభివృద్ధే లక్ష్యంగా..

- రాష్ట్ర ప్రభుత్వం అడుగులు
- పాడి రైతులపై ప్రత్యేక దృష్టి
- పశు సంపద, పాల ఉత్పత్తి పెంపునకు చర్యలు



జియ్యమ్మవలస, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశు సంపదను గణనీయంగా పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ మేరకు పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా మేలు జాతి పెయ్యి దూడలు జన్మించేందుకు వీలుగా సబ్సిడీపై లింగ నిర్ధారణ వీర్యం సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేసింది. పాడి రైతుల వద్ద ఉన్న సంకరి జాతి ఆవులకు ఆ ఇంజక్షన్లు వేయించాలని సూచించింది. వచ్చే ఏడాది మార్చి 31లోగా లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించింది. 2019 లెక్కల ప్రకారం జిల్లాలో పశు సంపద 14.67 లక్షలు. ఇందులో ఆవులు 2.29 లక్షలు, గేదెలు 49 వేలు. అయితే ప్రస్తుతం వాటి సంఖ్య బాగా తగ్గిపోయిందనే అంచనాకు జిల్లా అధికారులు వచ్చారు. ప్రతి జిల్లాల నివేదికను తీసుకున్న ప్రభుత్వం పశు సంపద పెంచి పాడి రైతుల జీవితాల్లో వెలుగులు నింపా లని భావిస్తోంది. ఈ మేరకు ఆవు పెయ్యి లు (ఆడ ఆవులు) జన్మించే విధంగా రూ. 150కే లింగ నిర్ధారిత వీర్య ఇంజక్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకుంది. జిల్లాలో 6,600 ఇంజక్షన్లు వేయించాలని అధికారులు, సిబ్బందికి ప్రభుత్వం దిశా నిర్దేశం చేసింది. ఇదే వీర్యం గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ. 550 పాడి రైతు చెల్లించాల్సిన పరిస్థితి ఉండేది. ఆవులకు, గేదెలకు కేవలం పెయ్యి దూడలు మాత్రమే పుట్టేందుకు రూపొందించిన లింగ నిర్ధారిత వీర్యం బయట మార్కెట్లో వేలల్లో అమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో పశు సంపద, పాల ఉత్పత్తిని పెంచాలనే ఉద్దేశంతో పాడి రైతులకు సబ్సిడీపై కేవలం రూ. 150 కే అందించేలాకూ కూటమి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చే సింది. దీనికోసం నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీ బీ)తో సంప్రదింపులు చేసింది. రానున్న ఐదేళ్లలో పశువుల్లో స్త్రీ సంపద పెంచి పాల ఉత్పత్తి పెంచి పాడి రైతుల జీవితాల్లో వెలుగులు నింపాలన్నది ప్రభుత్వ ఆలోచన. తద్వారా సంకర జాతి పశువుల హబ్‌గా జిల్లాను తీర్చిదిద్దనుంది.



పెదబుడ్డిడిలో పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్యాధికారి మునికుమార్ (ఫైల్)

పాడి రైతులకు అవగాహన..

వాస్తవంగా ఒక ఆవుకు కచ్చితంగా రెండు ఇంజక్షన్లు వేయాల్సి ఉంటుంది. దీని ద్వారా మేలు రకం సంకర జాతి ఆవుల సంఖ్య పెరుగుతుంది. తద్వారా పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుంది. జిల్లాలో 15 మండలాల పరిధిలో సీతంపేట, పాలకొండ, కురుపాం, గరుగుబిల్లి, పార్వతీపురం, సీతానగరం, సాలూరులో పశు వైద్యశాలలు ఉన్నాయి. వాటి పరిధిలో 38 పశు వైద్య చికిత్సాలయాలు, 35 గ్రామీణ పశువుల యూనిట్లు (ఆర్ఎల్‌వో)లు ఉన్నాయి. ఈ 80 ఆసుపత్రులకు అక్కడ పశు సంపదను బట్టి టార్గెట్లు విధించారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారుల (మిగతా 8వ పేజీలో..)

పశు వైద్యులను సంప్రదించాలి..

లింగ నిర్ధారిత మేలు జాతి వీర్యం వల్ల ఆడ పెయ్యిలు మాత్రమే పుడతాయి. దీనివల్ల పాడి ఆవులు, పాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుంది. తద్వారా పాడి రైతులు కూడా ఆర్థికంగా ఎదుగుతారు. ఇతర వివరాల కోసం పాడి రైతులు సమీపంలోని పశు వైద్యులను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చు.

-మన్మథరావు, జాయింట్ డైరెక్టర్, పశు సంవర్థక శాఖ

సీజన్ ముగుస్తున్నా.. దక్కని ప్రతిఫలం

- గిట్టుబాటు కాని పైనాపిల్ ధర
- గిరిజన రైతుల గగ్గోలు



సీతంపేట వారపు సంతలో పైనాపిల్ ఇలా..

సీతంపేట రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో గిరిజన రైతులకు ప్రతిఫలం దక్కడం లేదు. సీజన్ ముగుస్తున్నా పైనాపిల్ ధర పెరగకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. వాస్తవంగా ఈ ఏడాది దిగుబడి ఎక్కువగా వచ్చింది. అయితే ఆశించిన ధర మాత్రం రాలేదు. రోజురోజుకూ ధర క్షీణిస్తుండడంతో గిరిజన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. పంటను నిల్వ చేసుకునే అవకాశం లేక పోవడంతో ఎంతో కొంత ధరకు వారపు సంతల్లో పంటను విక్ర యిస్తున్నారు. గడిచిన ఆది, సోమవారాల్లో సీతంపేట వారపు సంతకు వచ్చిన పైనాపిల్ ధర రూ.8 ఉండగా.. ఈ వారం కాస్త పెరిగి రూ.10కు చేరింది. అంతకముందు వారం ఒక్కో పండును రూ.15 వరకూ విక్రయించేవారు. ప్రస్తుతం ధర భాగా తగ్గడంతో ఇదే అదునుగా మైదాన ప్రాంత వ్యాపారులు అధిక మొత్తంలో పైనాపిల్‌ను కొనుగోలు చేసి పట్టణాల్లో ఒక్కో పండును రూ.35 నుంచి 45కు విక్రయిస్తున్నారు. వ్యాపారులు, దళారులు లక్షల్లో సంపాదిస్తున్నా.. ప్రాంత గిరిజన రైతులు మాత్రం కనీస మద్దతు ధరకు నోచుకోవడం లేదు. ఈ ప్రాంతంలో పండే పైనాపిల్ పంటను నేరుగా రైతుబజార్లలో విక్రయించుకునేందుకు ఐటీడీఏ అధికారులు అవకాశం కల్పించారు. అయితే రవాణా ఖర్చులు భరించలేక గిరిజన రైతులు తక్కువ ధరకైనా వారపు సంతల్లోనే పంటను విక్రయిస్తున్నారు. కొండచీపుర్లు, ఇతరాత్ర సీజన్ పంటలకు సరైన గిట్టుబాటు ధర లేక పోవడంతో తాము ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. తమ కష్టానికి తగ్గ ప్రతిఫలం రావడం లేదని ఆవేదన చెందుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

తోటపల్లిలో తొలి ఏకాదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

గరుగుబిల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా పేరొందిన తోటపల్లి ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా నమో నారాయణ నామస్మరణ మార్మోగింది. వేంకటేశ్వరస్వామి, కోదండరామ స్వామి దేవస్థానాలకు భక్తులు పోటెత్తారు. ఉభయ ఆలయాల్లో స్వామివార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు వీవీ అప్పలచార్యుల ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ విశేష కల్యాణోత్సవాలను తిలకించి పరవశించిపోయారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈవో వీవీ సూర్యనారాయణ, సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. అనంతరం వారికి అన్నసమారాధన, ఉచిత ప్రసాదాలు అందించారు. జిల్లాలోని ప్రముఖ దేవాలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి. రామమందిరాలు, వేంకటేశ్వర, వేణుగోపాలస్వామి తదితర ఆలయాల్లో ఏకాదశి పూజలను నిర్వహించారు. భక్తుల రద్దీ దృష్ట్యా అంతటా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు

రహ'దారుణాలు'

- అధ్వానంగా జిల్లాలో రహదారులు
- గోతుల్లో వర్షపునీరు
- తీవ్ర అవస్థలు పడుతున్న వాహనదారులు



8లో

అగ్నిమాపక కేంద్రంలో సమస్యల తిష్ఠ

●సిబ్బంది కొరత, కాలం చెల్లిన వాహనంతో సేవలు

గజపతినగరం, జూలై6 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు సంభవించిన తక్షణమే స్పందించి ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగక కుండా కాపాడే అగ్నిమాపక కేంద్రంలో సమస్యలు తిష్ఠ వేశాయి. గజపతినగరం నియోజక వర్గానికి సంబంధించి గజపతినగరం, మెంటాడ, దత్తిరాజేరు, బొండపల్లి మండలాల్లో సేవలు అందించేందుకు మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్ర కార్యాలయాన్ని 1988లో ప్రారంభించారు. 37 ఏళ్ల కావస్తున్నప్పటికీ కనీస సదుపాయాలకు దూరంగా ఉంది. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో చిన్నపాటి వర్షానికి కారిపోతోంది. అందులో రికార్డులు తడిసిపోతున్నాయి. రాత్రి సమయాల్లో విష పురుగుల సంచారం కూడా అధికంగా ఉంది. ఎప్పుడు ఎటువంటి ప్రమాదానికి గురికావల్సి వస్తుందోనని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. 15 ఏళ్ల దాటిన తర్వాత పాత వాహనం స్థానంలో కొత్త వాహనం మంజూరు చేయాల్సి ఉన్నప్పటికీ కాలం చెల్లిన వాహనాన్నే వినియోగిస్తున్నారు. గతంలో టీడీపీ హయాంలో అదనపు వాహనం మంజూరుకు అప్పటి ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు ప్రతిపాదనలు చేశారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దాంతో కాలం చెల్లిన వాహనంతోనే సేవలు అందిస్తున్నారు. ముగ్గురు వాహన డ్రైవర్లు ఉండాల్సి ఉన్నప్పటికీ 1 డ్రైవర్ పోస్టు ఖాళీగా ఉంది. 9 మంది మెన్‌లు ఉండాల్సి ఉన్నప్పటికీ 5గురు మాత్రమే ఉన్నారు. 2020లో పోస్టుల భర్తీ చేపట్టడం జరిగిందని నాటి నుంచి నేటి వరకు పోస్టుల భర్తీ కాకపోవడంతో అరకొర సిబ్బందితో సేవలు అందజేయాల్సి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అగ్నిమాపక కేంద్రంలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు కొత్త భవనం నిర్మాణం చేపట్టడంతో పాటు అలాగే కొత్తవాహనం సమకూర్చాల్సిన అవసరం ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

గజపతినగరంలో అగ్నిమాపక కేంద్రంలోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కాలం చెల్లిన వాహనంతో విధులు నిర్వహించడం, సిబ్బంది కొరత విషయం ఇప్పటికే తెలియజేశాం.

-ఎం.వి.ఎస్.రవిప్రసాద్, అగ్నిమాపక కేంద్ర అధికారి, గజపతినగరం



గజపతినగరంలో ఫైర్ స్టేషన్ ఇదే..

రామతీర్థంలో చాతుర్మాస దీక్ష ప్రారంభం

నెల్లిమర్ల, జూలై6 (ఆంధ్రజ్యోతి): రామతీర్థంలోని రామచంద్రస్వామివారి దేవాలయంలో ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామివారి శయన మూర్తులకు విశ్వక్సేన ఆరాధన చేసి శ్రీసీతారామచంద్రస్వామి వారి శయన మూర్తులను చాతుర్మాస దీక్షతో పవళింపు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ఏటా ఆషాడ శుద్ధ ఏడాదశి నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు నాలుగు నెలలు శ్రీమహావిష్ణువు యోగ నిద్రలో చాతుర్మాస దీక్షలో ఉంటూ మనందరినీ ఆశీర్వదిస్తూ ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు మడ్డువలస నీరు విడుదల

రాజాం, జూలై6 (ఆంధ్రజ్యోతి): గొర్లె శ్రీరాములునాయుడు రిజర్వాయర్ (మడ్డువలస ప్రాజెక్టు) నుంచి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సాగునీరు విడుదల చేస్తారని డీఈ పి.అర్జున్, ఏఈఈలు నితిన్‌కుమార్, అనిల్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. వంగర, రేగిడి, సంతకవిటి, జి.సిగడాం, పొందూరు, లావేరు మండలాలకు చెందిన 30077 ఎకరాలకు 100 క్యూసెక్కులు నీరును విడుదల చేస్తామని పేర్కొన్నారు.

అలరించిన సంగీత కచేరీ

విజయనగరం బాబామెట్ట, జూలై6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కాశీపతిరావు స్మారక భవనంలో ఆదివారం పద్మవిభూషణ్ డా.మంగళంపల్లి బాలమురళీకృష్ణ 95వ జయంతిని ఆదివారం ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. బాల మురళీకృష్ణ ఆలపించిన గీతాలను విశాఖకు చెందిన వీణ విద్వాంసురాలు డాక్టర్ నిర్మల కృష్ణవంశీ వీణలో పలికించి ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి వీణపై వేదుల రమణ, సంస్థ కార్యదర్శి మండపాక రవి మృదంగ వాయిద్య సహకారం అందించారు. సంస్థ అధ్యక్షుడు సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

40 బియ్యం బస్తాల వితరణ

రేగిడి, జూలై6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వావిలవలసలలో గల రాహుల్ సౌరబ్ అన్నదాన సత్రానికి ఆదివారం ఏపీ రైస్‌మిల్లు అసోసియేషన్ అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు 40 బియ్యం బస్తాలను వితరణ చేశారని సత్రం నిర్వాహకుడు, సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సత్రంలో కరోనా కాలం మొదలు 2488 రోజులుగా నిరుపేదలకు నిత్యాన్నదానం చేస్తుండటాన్ని గుర్తించి ఐఎఎస్ సౌరబ్ గౌర్, ఏపీ రైస్‌మిల్లు అసోసియేషన్ వితరణకు ముందుకు వచ్చారని సిద్ధార్థ వివరించారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఏకలవ్యుడి జయంతి

శృంగవరపుకోట రూరల్, జూలై6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరుకులపేటలో ఆదివారం ఏకలవ్యుడి జయంతిని నిర్వహించారు. ఎరుకుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గేదెల సత్తిబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు రొంగలి చిన్నరాము, సంఘ ఉత్తరాంధ్ర చైర్మన్ గేదెల లక్ష్మణ్, ఎరుకుల సేవా సంఘం మహిళ కార్యదర్శి దాసరి సత్యవతి, మహిళ ఉపాధ్యక్షురాలు గనివాడ సంతోషి కుమారి, గౌరీశంకర్, రమణ, గేదెల అప్పారావు, దాసరి సత్య నారాయణ, దేము డమ్మ, పోతయ్య పాల్గొన్నారు.

బాధితుడికి నిత్యావసరాలు

రాజాం రూరల్, జూలై6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 17వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు ఉదారతను చాటుకున్నారు. గడచిన వారం రోజులుగా కురిసిన వర్షాలకు నేలమట్టమైన ఇంటి యజమానికి అండగా నిలబడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఈనెల 4న రాత్రి పట్టణంలోని అమ్మవారి కాలనీలోని రెండో లైన్‌కి చెందిన బత్తిన నూకరాజుకు చెందిన ఇల్లు వర్షానికి నేలమట్టమైంది. దీంతో స్పందించిన టీడీపీ నాయకులు మరిపి జగన్మోహనరావు, గంధి గోపి.. నూకరాజు కుటుంబానికి బియ్యం, నిత్యావసర వస్తువులను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో పద్మశ్రీ, శ్రీను, వెంకటరమణ, యోగేశ్వరరావు ఉన్నారు.

రహ్మాన్ కుటుంబానికి ఆర్థికసాయం

జామి, జూలై6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోట్లపల్లి గ్రామానికి చెందిన సచివాలయ విద్యుత్ ఉద్యోగి షేక్ రహ్మాన్ కుటుంబానికి అండగా ఉంటామని ఏపీఈఈయూ 1104 యూనియన్ ప్రతినిధులు అన్నారు. ఆదివారం రహ్మాన్ కుటుంబ సభ్యులకు వారు రూ.25 వేలు ఆర్థికసాయం అందజేశారు వర్కింగ్ అధ్యక్షుడు లక్ష్మణ్ గంగునాయుడు, పైడిరాజు, దేముడు, అప్పలనాయుడు ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

●మంత్రి కొండపల్లి శ్రీనివాస్



సీతారామపురంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం, జూలై6 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని సీతారామపురం, పిడిశీల గ్రామాల్లో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా గ్రామీణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 3 సెంట్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన సాగిస్తోందన్నారు. అనంతరం మండలంలోని మల్లునాయుడుపేటకు చెందిన మిత్తిరెడ్డి రమణకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.19 లక్షల చెక్కు మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పి.వి.వి.గోపాలరాజు, ఆంధ్ర ప్రాజెక్టు చైర్మన్ కోడి సతీష్, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ముక్కువ శ్రీధర్, గుంట్రోతు గోవింద, మిత్తిరెడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి స్థానిక సమస్యలు

జామి, జూలై6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నంరాజుపేటలో ఆదివారం సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో కలియదిరిగారు. సీసీ రోడ్డు వేయాలని, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, రామాలయం అభివృద్ధికి సహకరించాలని మంత్రిని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలనపై మంత్రి ఆరా తీశారు. దాంతో స్థానికులు పథకాల అమలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు స్వామి నాయుడు, పైడిరాజు, మాకిరెడ్డి శ్రీలక్ష్మి, ముకుంద శ్రీనివాస్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ పార్కుకు ప్రభుత్వ ప్రతిపాదన

విజయనగరం కలెక్టరేట్, జూలై6(ఆంధ్రజ్యోతి) జిందాల్ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కు అభివృద్ధి ప్రభుత్వ ప్రతిపాదనలో ఉందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. అయితే పార్కులో ఎటువంటి పరిశ్రమలు వస్తాయన్నది ఇంకా స్పష్టత లేదన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిందాల్ నిర్వాసిత రైతులకు ఇంకా ఏమైనా పెండింగ్ సమస్యలు ఉంటే వాటిని ప్రభుత్వం తప్పకుండా పరిష్కరిస్తుందన్నారు. గత ప్రభుత్వం హయంలో ఇచ్చిన జీవోకు తమపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని మంచి స్పందన వస్తోందన్నారు. ఏడాది కాలంలో సంక్షేమం, అభివృద్ధి అనే రెండు కళ్ళుగా సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని పాలిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. ఉద్యోగ కల్పన ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అనేక కంపెనీలు వస్తున్నాయన్నారు. దాదాపు 4 లక్షల కోట్ల పెట్టుబడి ఉత్తరాంధ్రకు వస్తున్నాయన్నారు. దీంతో 10వేల ఉద్యోగాలు వస్తాయన్నారు. వైసీపీ హయంలో అనేక జిల్లా సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. వాటిని ఇప్పుడు సరిచేస్తున్నామన్నారు. ఐదేళ్లు బటన్ నొక్కుడు పేరుతో కాలయాపన చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేసే వైసీపీ నాయకులు తగ ఐదేళ్ల ఏం చేశారో చెప్పాలన్నారు. ఎవరి హయాంలో జిల్లా అభివృద్ధి జరిగిందో.. బహిరంగ చర్చకు వస్తారా అని బొత్స సత్యనారాయణకు మంత్రి సవాల్ విసిరారు.

పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరి



శునకానికి టీకా వేస్తున్న జేడీ రమణ

విజయనగరం రింగురోడ్డు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు సంవర్ధకశాఖ జేడా డాక్టర్ వై.వి.రమణ అన్నారు. జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం బహుళార్థ పశు వైద్యకళాశాలలో పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు, కోళ్ల ఇతర పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి అన్నారు. ముఖ్యంగా పెంపుడు శునకాలు, పిల్లులకు యాంటీ రాబిస్ టీకాలు వేయించాలన్నారు. ఈ సందర్భంగా 584 పెంపుడు శునకాలు, పిల్లులకు రాబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఇక్కడ వివిధ రకాల జాతులకు చెందిన శునకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఉప సంచాలకుడు డాక్టర్ కంటి మహాలక్ష్మి, సహాయ సంచాలకుడు డాక్టర్ సన్యాసినాయుడు, డాక్టర్ కె.వి.రమణ, డాక్టర్ కిశోర్, డాక్టర్ ధర్మారావు, మోహన్, హిమజ సిబ్బంది పాల్గొన్నారు.

●వేపాడ: మండల పశువైద్య కేంద్రంలో పెంపుడు కుక్కలకు ఆదివారం పశు వైద్యాధికారి కోరాడ గాయత్రి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ప్రపంచ ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాక్సిన్లు వేశామని తెలిపారు.

●రేగిడి: పెంపుడు కుక్కలకు రేబిస్ నియంత్రణ టీకాలు వేడం తప్పనిసరి అని రేగిడి పశువైద్యాధికారి దుర్గాప్రసాద్ అన్నారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రేగిడి వెటర్నరీ అనుపత్రిలో కుక్కలకు రేబిస్ టీకాలు వేశారు.

మీరు విమర్శించండి.. మేము అభివృద్ధి చేస్తాం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున



మాట్లాడుతున్న నాగార్జున

చీపురుపల్లి, జూలై6 (ఆంధ్రజ్యోతి): మీరు విమర్శలు చేస్తుంటే, మేము మాత్రం అభివద్ధి చేసుకుంటూ ముందుకు సాగుతామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున.. వైసీపీ నేత బొత్స సత్యనారాయణను ఉద్దేశించి అన్నారు. ఆదివారం ఆయన చీపురుపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వంపై మాజీ మంత్రి బొత్స వాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ఇచ్చిన హామీల్లో ఇప్పటికే చాలావరకూ అమలయ్యాయన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్‌లతో ప్రజలకు మేలు జరిగిందన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం హయాంలో రద్దయిన అన్న క్యాంటీన్లు ఇప్పుడు పని చేస్తున్నాయన్నారు. ఈ విషయాలన్నీ ప్రజల్లోకి వెళ్తే వారికి తెలుస్తాయని నాగార్జున వ్యాఖ్యానించారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యం



పాటూరులో ఎమ్మెల్యే లలితకుమారి

వేపాడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజ నిర్మాణమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. ఆదివారం మండలంలోని పాటూరులో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. పథకాల అమలుపై ఆరా తీశారు. దాంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీసీసీ డైరెక్టర్ దాసరి లక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ జనపురెడ్డి సన్యాసమ్మ, సన్యాసిరావు, అప్పలనాయుడు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జి నాగభూషణం, చల్లా వెంకటరావు, నిరుజోగి అమ్మతల్లినాయుడు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి హామీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బంగార్రాజు

భోగాపురం, జూలై6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడ పంచాయతీ ఎరుసుపేట, మద్దిపేట, గుడివాడ గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే లోకం నాగమాధవి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో ఆమె మాట్లాడారు. తాగునీరు, పెన్షన్లు, ఇంటింటి కుళాయి తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే.. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసైనికులు పాల్గొన్నారు.

ఏడాది పాలనపై ప్రజల్లో ఆనందం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, జూలై6 (ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనపై ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తోందని మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. ఆదివారం నందిగాంలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంగార్రాజు ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'చరిత్ర చెప్పిన కథలు' పుస్తకావిష్కరణ




పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

విజయనగరం బాబామెట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సాహిత్యానికి కాలం చెల్లదని ఇండియన్ నేషనల్ ట్రస్టు ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ పూర్వపు కన్వీనర్, రచయిత్రి రాణి శర్మ అన్నారు. ఆదివారం ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జి.వి.శ్రీనివాస్ రచించిన 'చరిత్ర చెప్పిన కథలు' కథా సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్వపడే భాష ఉత్తరాంధ్ర భాషన్నారు. ఈ పుస్తకంలో చరిత్రకు ఒక జీవితం ఇచ్చారన్నారు. ముందు తరాలకు వారి వారసత్వాన్ని రచయిత ఇందులో తెలిపారన్నారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి నిర్వాహకుడు చీకటి దివాకర్, రచయిత గంటేడ గౌరీనాయుడు, సాయి పాపినేని, మంజరి, కె.కె.రఘునందన, డి.వెంకటరావు, సహజ సాంస్కృతిక అధ్యక్షుడు ఎన్.కె.బాబు, మయూర హోటల్ ఎండీ యార్లగడ్డ బాబు, పలువురు సాహితీ అభిమానులు పాల్గొన్నారు.


ఘనంగా 'తొలి ఏకాదశి'

విజయనగరం రూరల్, జూలై6 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని వివిధ ఆలయాల్లో ఆషాడ శుద్ధ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివార్ల దర్శనానికి భక్తులు బారులు తీరారు. నగరంలోని మన్నార్ రాజగోపాలస్వామి ఆలయం, తోటపాలెంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, శివాయలం వీధిలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, రింగురోడ్డులోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాల తో పాటు నగరంలోని పలు వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట కోదండ రామాలయంలో 12 గంటల పాటు హరే రామ నామసంకీర్తను చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, పలు ప్రాంతాల నుంచి వచ్చిన 50 మంది భజన కళాకారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



విజయనగరం: కొత్తపేట కోదండ రామాలయంలో..

●నెల్లిమర్ల: మండలంలోని మొయిద విజయరాంపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకుడు ఆచంట శ్రీనివాసశర్మ చేపట్టారు



ఎస్.కోట రూరల్ వేంకటేశ్వర ఆలయంలో..

●శృంగవరపుకోట రూరల్: మండలంలోని భర్తపురంలో గల కల్యాణ ప్రసన్న వైభోగ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాండ్రేగుల జయవిష్ణు పూజలు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

కొత్తవలస, జూలై6 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస పంచాయతీ ఉమాదేవి కాలనీకి చెందిన గంగవరపు గౌరి సత్యవరప్రసాద్(38) ఆదివారం మధ్యాహ్నం తమ్మన్నమెరక సమీపంలోని మామిడి తోటలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన భర్త మృతికి ఓ మహిళ కారణమని మృతుడి భార్య ఎర్నెమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో సీఐ షణ్ముఖరావు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉమాదేవి కాలనీకి చెందిన గంగవరపు గౌరి సత్యవరప్రసాద్, అతడి భార్య ఎర్నెమ్మ.. రాజన్న కాలనీ వద్ద ఇటుకల బట్టీ పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు తోరణశ్రీ, శ్యామ్‌సుందర్ ఉన్నారు. మృతుడిది గంట్యాడ మండలం లక్కిడాం గ్రామం. అక్కడ నుంచి 20 ఏళ్ల కింద కొత్తవలస మండలానికి వలస వచ్చి నివాసం ఉంటున్నారు. ఓ మహిళతో సత్య వరప్రసాద్ సాన్నిహిత్యం పెంచుకున్నాడు. దీంతో తన సంగతేంటో తేల్చి చెప్పాలని లేకుంటే తాను ఆత్మహత్య చేసుకుంటానని ఆమె తరచూ బెదిరించేదని అతడి భార్య పోలీసులకు తెలిపింది. ఆదివారం కూడా సదరు మహిళ సత్య వరప్రసాద్‌కు ఫోన్ చేయడంతో సమీపంలోని మామిడి చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడని తెలిపింది. వరప్రసాద్‌కు ఉరేసుకున్న విషయాన్ని సదరు మహిళ.. మృతుడి తమ్ముడికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది. దాంతో వరప్రసాద్ భార్య ఘటనా స్థలానికి వెళ్లింది. అప్పటికే భర్త మృతి చెందినట్టు గుర్తించింది. వరప్రసాద్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ఎవరైనా హత్య చేసి చెట్టుకు వేలాడదీశారా? అనే అనుమా నాలు వ్యక్తమవుతున్నాయి. విజయనగరానికి చెందిన చెందిన క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ వచ్చి పరిశీలించాయి. మృతుడి భార్య ఎర్నెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ షణ్ముఖరావు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శృంగవరపుకోట ఆసుపత్రికి తరలించారు.

రైలు కింద పడి వృద్ధుడు..

కొత్తవలస, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : గూడ్స్ రైలుకు ఎదురుగా వెళ్లి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కొత్తవలస రైల్వే స్టేషన్ సమీపంలో లో ఆదివారం జరిగింది. ఇందుకు సంబంధించి జీఆర్పీ ఎస్ఐ బాలాజీరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ జిల్లా పెందుర్తి మండలం వేపగుంట సమీపం సింహపురికాలనీలో నివాసం ఉంటున్న చొప్ప సీతారామయ్య (78) ఆరోగ్య సమస్యలు కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. మృతుడు సీతారామయ్య భార్య నాలుగు సంవత్సరాల కిందట మృతి చెందడంతో తన కుమారుడు వద్ద సింహపురికాలనీలో నివాసం ఉంటున్నాడు. గత కొద్దిరోజులుగా సీతారామయ్య తీవ్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో విరక్తి చెందిన సీతారామయ్య ఆదివారం ఉదయం సింహపురి కాలనీ నుంచి కొత్తవలస సిటీ బస్సులో వచ్చి జంక్షన్‌లో దిగాడు. అక్కడ నుంచి కొత్తవలస రైల్వే స్టేషన్‌కు నడుచుకుంటూ వెళ్లి రైల్వేస్టేషన్ నుంచి కొద్ది దూరం రైలు పట్టాలపై నడుచుకుని వెళ్లి ఎదురుగా వస్తున్న గూడ్స్ రైలు కింద పడిపోవడంతో అక్కడక్కడే మృతి చెందాడు. మృతుడు సమాచారాన్ని జీఆర్‌పీ పోలీసులకు స్థానిక స్టేషన్ మాస్టారు ఇవ్వడంతో జీఆర్పీ పోలీసులుంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలన చేశారు. మృతుడు జేబులో లేఖ ఉంది. తన చావుకు ఎవరూ కారణం కాదని, తాను ఆరోగ్య సమస్యలు కారణంగానే మృతి చెందినట్టు రాసుకున్నాడు. మృతుడి జేబులో ఆధార్ కార్డులో వివరాలను గుర్తించి మృతుడి కుమారుడికి సమాచారం అందించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పాలభిషేకం



పాలభిషేకం చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట రూరల్, జూలై6 (ఆంధ్రజ్యోతి): తాము ప్రధాని మోదీ పాలనలో ఉన్నామా.. ఆంగ్లేయుల పాలనలో ఉన్నామా అర్థం కావడం లేదని జిందాల్ నిర్వాసితులు అన్నారు. శాంతియుత పోరాటానికి అనుమతులు కావాలని ఎస్పీని కోరినా ఇవ్వడం ఆవేదన వ్యక్తం చేస్తూ మండలంలోని బొడ్డవరలో మహాత్మ గాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటాలకు ఆదివారం పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ గాంధీ అవలంబించిన అహింస విధానంలో పోరాటం చేస్తున్నామన్నారు. అంబేడ్కర్ ప్రసాదించిన రాజ్యాంగ హక్కులను పోలీసులు ఉల్లంఘించడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం న్యాయపరమైన హక్కులు కాపాడాలని చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు.

బోధనేతర పనులు తగ్గించండి




మాట్లాడుతున్న శ్రీనివాస్

విజయనగరం దాసన్నపేట, జూలై6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనేతర పనుల భారం తగ్గించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలతేరు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సంఘ కార్యాలయంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో బోధనేతర పని భారం పెరుగుతోందని ఆందోళన వెలిబుచ్చారు. జూలై 10న జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం కోసం లీప్ యాప్‌లో విట్నస్ రిజిస్ట్రేషన్‌లో అన్ని స్కూల్స్‌లో జరగాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారన్నారు. ఈ విట్నస్ పెట్టుకున్న వ్యక్తి పీటీఎం జరిగే రోజున 30 సెకెండ్ల వీడియో, 4 ఫొటోలు అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. విద్యార్థులు యూనిఫాంలు, బెల్టులు, షూస్, పుస్తకాలు మాత్రమే కాకుండా మధ్యాహ్న భోజనం పథకానికి బియ్యం మొదలగు వాటిపై ప్రత్యేక కోడ్ నెంబరు ఇచ్చి యాప్స్‌లో అప్‌లోడ్ చేయాలని ఒత్తిడికి గురిచేయడం తగదన్నారు. కొత్త నిర్ణయాలు ఉపాధ్యాయులపై నమ్మకం లేని విధంగా అవమానించేలా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు షేక్ బుకారిబాబు, బంకురు జోగినాయుడు, సబ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి

●గ్రామస్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

రేగిడి, జూలై6 (ఆంధ్రజ్యోతి): మండలంలో బూరాడ సెంటర్- వంగర రూట్‌లో ఉణుకూరు వద్ద రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు ఆదివారం ఆందోళనకు దిగారు. ఎనిమిదేళ్లుగా దాదాపు 300 మీటర్ల రోడ్డుకు కనీస మరమ్మతులు చేపట్టలేదని సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో వారు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉణుకూరు వద్ద గుంతలతో రోడ్డు నరకప్రాయంగా ఉందన్నారు. గుంతలు లేని రోడ్డుగా తీర్చిదిద్దుతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని వారు ప్రశ్నించారు. ఈనెల 14లోగా రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోతే అదేరోజు రాస్తారోకో చేస్తామని వారు హెచ్చరించారు. ఆందోళనలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.శంకరరావు, కార్యదర్శి మడపాన త్రినాథరావు, వియ్యపు లక్ష్మంనాయుడు, జి.దుర్గారావు పాల్గొన్నారు.

9న టైర్ బంద్ పాటిద్దాం

విజయనగరం దాసన్నపేట, జూలై6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న టైర్ బంద్ కార్యక్రమాన్ని పాటిద్దామని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కో-కన్వీనర్ ఎ.జగన్మోహనరావు కోరారు. ఆదివారం నగరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రైవర్ల మెడకు ఉరితాడు బిగించి రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే మోటారు వాహన చట్టం, భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 10 కోట్ల మంది రవాణా కార్మికులకు కేరళ తరహాలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. లైసెన్స్ రెన్యువల్, రిజిస్ట్రేషన్, వాహన ఫిట్‌నెస్ సరిఫికెట్లను ఆర్టీవో కార్యాలయంలో జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు టి.పైడిరాజు, సత్తిబాబు, లక్ష్మణరావు, గంగరాజు, ఐ.ప్రసాద్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రహ'దారుణాలు'

- అధ్వానంగా జిల్లాలోని రహదారులు
- గోతుల్లో చేరుతున్న వర్షపునీరు
- తీవ్ర అవస్థలు పడుతున్న వాహనదారులు

ప్రభుత్వాలు మారుతున్నా రహదారుల పరిస్థితి ఇప్పటికీ మారడం లేదు. జిల్లాలోని పలు రహదారులు ఇప్పటికీ గోతులమయంగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఆ గోతుల్లో నీరు చేరి మరింత ఇబ్బందికరంగా మారుతున్నాయి. ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. కొన్నిచోట్ల రహదారి నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచాయి. మరి కొన్నిచోట్ల రహదారులు పూర్తిచేసినా నాణ్యత కొరవడుతోంది.



గరుగుబిల్లి: కోటవానివలస వద్ద గోతులమయమైన ప్రధాన రహదారి

ఏ ముహూర్తాన ప్రారంభించారో..

- అర్ధాంతరంగా బత్తిలి రహదారి

భామిని, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బత్తిలి రహదారి నిర్మాణం ఏ ముహూర్తాన ప్రారంభించారో గానీ పనులు పూర్తి కాక వాహనదారులు నరకం చూస్తున్నారు. వైసీపీ హయాంలో మెటల్ వేసి విడిచిపెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అలికాం-బత్తిలి రహదారిలో కొరమ నుంచి బిల్లుమడ వరకు మరమ్మతులు చేశారు. అలాగే బిల్లుమడ నుంచి బత్తిలి వరకు ఏడు కిలోమీటర్ల మేర రోడ్డు వేసేందుకు తవ్వి వదిలేశారు. దీంతో గుంతల్లో వర్షపునీరు చేరి వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే భామిని సమీపంలో భారీ గుంత, బిల్లుమడ నుంచి బత్తిలి వరకు అడుగడుగునా ఏర్పడిన గుంతలు ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి.

- దీనిపై ఆర్‌అండ్‌బీ జేఈ కిరణ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా వర్షాల వల్ల రోడ్ల నిర్మాణానికి అవకాశం లేకుండా పోతుందని, త్వరలో బీటీ రోడ్డు వేస్తామని తెలిపారు.



భామిని: నేరడి బ్యారేజ్ వద్ద గుంతల రోడ్డు


నరకం చూస్తున్నారు..

- గోతులమయంగా పార్వతీపురం-పాలకొండ రహదారి

గరుగుబిల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నుంచి పాలకొండ ప్రధాన రహదారి మార్గంలో ప్రయాణం చేస్తున్న వాహనదారులు నరకం చూస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో రహదారి గుతుల్లో వర్షపు నీరు చేరి అసౌకర్యంగా తయారయ్యింది. ప్రధానంగా పార్వతీపురం నుంచి కోటవానివలస ప్రధాన రహదారి మార్గం అడుగడుగునా గోతులమయం కావడంతో నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. సుమారు మూడు కిలో మీటర్ల పరిధిలోని రహదారితో నిత్యం అవస్థలు తప్పడం లేదు. అధికారులు దృష్టి సారించి కొత్తవలస నుంచి కోటవానివలస వరకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పెచ్చులూడుతున్నాయి..

వీరఘట్టం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మండలంలోని పలు రహదారులకు మరమ్మతులు చేపట్టారు. వండువ సెంటర్ నుంచి నవగాం వరకు, నడుకూరు నుంచి కిమ్మి వరకు రహదారులకు మరమ్మతులు చేశారు. అయితే మరమ్మతులు చేపట్టిన కొద్ది రోజుల్లోనే రహదారులు పెచ్చులూడుతున్న పరిస్థితి దాపురించింది.



వండువ సెంటర్ దగ్గరలో ఇలా..



గ్రామీణ రోడ్లు బురదమయం..

భామిని, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గురండి గ్రామ రహదారి వర్షం పడితే చాలు చిత్తడిగా మారుతుంది. ఏబీ రోడ్డు నుంచి గురండి గ్రామంలోకి వెళ్లే మార్గంలో కేవలం వంద మీటర్లు సీసీ రోడ్డు వేయగా మిగతా పనులు పూర్తి చేయలేదు. దీంతో గురండి గ్రామం ముఖద్వారం వద్ద గుంతలుగా మారి బురదమయం అయ్యింది. వర్షాల కారణంగా మరింత చిత్తడి మారుతోంది. వాహనదారులు, బాటసారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

గురండి వద్ద ఆంధ్రా, ఒడిశా సరిహద్దు రహదారి



మక్కువ: ఇదీ సువర్ణముఖి వంతెన పరిస్థితి

చినుకు పడితే చిత్తడే..

- శిథిలావస్థలో సువర్ణముఖి నది వంతెన

మక్కువ, జూలై 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సువర్ణముఖి నదిపై వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెనపై రహదారి గోతులమయం కావడంతో చినుకుపడితే చిత్తడిగా మారుతోంది. సమారు 30 గ్రామాల ప్రజలు రాకపోకలు ఈ వంతెన మీదనే కొనసాగిస్తున్నారు. గతంలో పలువురు గాయాల పాలైన ఘటనలు ఉన్నాయి. దీనికి తోడు వంతెనకు ఇరువైపులా రక్షణగోడలు విరిగిపోయి ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి గోతులు పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

పాదయాత్రలో ప్రభుత్వ విప్

గరుగుబిల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సమరసత సేవా ఫౌండేషన్ నిర్వహించిన ధర్మ రక్ష పాదయాత్రలో కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. పార్వతీపురం నుంచి తోటపల్లిలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం వరకు ఫౌండే షన్ ప్రతినిధులు ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. ఖడ్గవలస సముదాయానికి పాదయాత్ర చేస్తున్న సమయంలో ఆమె పాదయాత్రలో పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తాడికొండ పంచాయతీకి మధ్యాహ్నం పూట బస్సు సౌకర్యం కల్పించాలని ఆ పంచాయతీ ప్రజలు కోరుతున్నారు. పంచాయతీకి చెందిన ఎనిమిది గ్రామాల ప్రజలు నిత్యం ఏదోఒక పనిపై గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రానికి వెళ్తుంటారు. ఉదయం బస్సు సౌకర్యం ఉన్నప్పటికీ మధ్యాహ్నం లేకపోవడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. మధ్యాహ్నం పూట కూడా తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని తాడికొండ పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

క్రీడాకారుడికి అభినందన

పాలకొండ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సాధారణ గిరిజన కుటుంబంలో పుట్టి భారత కబడ్డీ జట్టు ప్రోబబుల్స్‌కు సెలెక్ట్ అయిన సీతంపేట ఆదివాసీ బిడ్డ పాలక మణికంఠను జిల్లా కబడ్డీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పల్లా కొండలరావు, సెక్రటరీ వెన్నపు చంద్రశేఖర్ అభినందించారు. ఈ మేరకు ఆదివారం పాలకొండలోని కొండలరావు ఇంటిలో క్రీడాకారుడిని సత్కరించారు. ఇటీవల హరిద్వార్‌లో జరిగిన నేషనల్ మీట్‌లో రాష్ట్రానికి కెప్టెన్‌గా వ్యవహరించిన మణికంఠ ఆటతీరును చూసి భారత ప్రొబబుల్స్‌కు ఎన్నిక చేసినట్టు సెక్రటరీ వెన్నపు శేఖర్ తెలిపారు. తనను ఎంతగానో ప్రోత్సహించి శిక్షణ ఇచ్చిన కోచ్‌లకు, పల్లా కొండలరావు, వెన్నపు శేఖర్‌కు మణికంఠ కృతజ్ఞతలు తెలిపారు.

జనసేన బలోపేతానికి కృషి చేయాలి

పాలకొండ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ శ్రీకాకుళం జిల్లా సంయుక్త కార్యదర్శి జనసేన జానీ తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పాలకొండ నియోజకవర్గంలో జనసేన విజయానికి జనసేన నాయకులు ఎంతో కష్టపడ్డారన్నారు. టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి జనసేన పార్టీపై ఇటీవల విమర్శలు చేయడం తగదన్నారు. ఇప్పటికైనా భూదేవి తప్పుడు విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పొట్నూరు రమేష్, పొగిరి జగన్, జామి అనీల్, సవర రాజేష్, రఘుమండల గణేష్, సవర సింహాద్రి, గోలి అనీల్, సవర గణేష్, పక్కి ప్రేమ్, ఇతర జనసైనికులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి

పార్వతీపురంటౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దివంగత నేత బాబూ జగ్జీవన్‌రామ్‌కు తాము రుణపడి ఉంటామని జిల్లా మాదిగ ఉద్యోగుల సంఘ నాయకులు కాగాన సల్మాన్, విజయ్‌కుమార్‌లు అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక సౌందర్య థియేటర్ రోడ్డు వీధిలో గల ఆయన విగ్రహానికి వారు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.



నివాళులు అర్పిస్తున్న మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు

రైతులకు ఏ కష్టం రానివ్వం

(ఐదో పేజీ తరువాయి)

అందించాలని ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పంచాయతీల పరిధిలో నిర్వహిస్తున్న ఉపాధి పనులకు సర్పంచ్‌లు ఆటంకాలు కల్పించరాదని సూచించారు. తోటపల్లి ప్రాజెక్టు ద్వారా గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాలకు సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి కోరారు. అంతకముందు ఎన్టీఆర్, సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాలకు వారు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

భూ సమస్య పరిష్కారం..

పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ మాట్లాడుతూ.. తోటపల్లి ప్రాజెక్టుకు సంబంధించి భూసమస్య పరిష్కారమైందన్నారు. ఉపాధి హామీ పథకంలో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. నిర్వాసితుల సమస్యలు దాదాపుగా పరిష్కారమయ్యాయని చెప్పారు. ఈ ప్రాంతం పర్యాటకానికి అనుకూలంగా ఉందని, తోటపల్లికి ప్రత్యేక గుర్తింపు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జల వనరులశాఖ ఎస్ఈ స్వర్ణకుమార్, ఈఈ మన్మథరావు, డీఈఈలు టి.రఘునాథనాయుడు, బి.గోవిందరావు, జేఈలు బి.కిషోర్‌కుమార్, శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్, ట్రైకార్ డైరెక్టర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

- మంత్రి సంధ్యారాణి

కొమరాడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని స్త్రీ శిశు, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మార్కండపుట్టి గ్రామంలో ఆమె ఆదివారం పర్యటించి, ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. మంత్రి తోపాటు ప్రభుత్వ విప్ జగదీశ్వరి పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తోటపల్లి నిర్వాసితులకు ఏమైనా సమస్యలుంటే పరిష్కరిస్తామన్నారు. జంఝావతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పూర్ణపాడు, లాబేసు పనులు త్వరలోనే పూర్తవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైరిచర్ల వీరేశ్‌దేవ్, ట్రైకార్ డైరక్టర్ లావణ్య, ఏఎంసీ ఛైర్మన్ కళావతి, టీడీపీ మండల అధ్యక్షుడు శేఖర్ పాత్రుడు, స్థానిక సర్పంచ్ జంజేటి నిర్మల, అరకు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షుడు ఎంపీటీసీ దేవకోటి వెంకటనాయుడు, టీడీపీ నాయకులు మధుసూదనరావు, ఎం.తిరుపతినాయుడు, గొట్టాపు త్రినాథ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ జగదీశ్వరి

పాడి అభివృద్ధే లక్ష్యంగా..

(ఐదో పేజీ తరువాయి)

నుంచి పశు వైద్యశాలలు, చికిత్సాలయాలు, ఆర్‌ఎల్‌యూలకు మౌఖిక ఆదేశాలు అందాయి. దీంతో పశు వైద్యాధికారులు, సిబ్బంది పాడి రైతులకు పరిస్థితిని తెలియజేస్తున్నారు. పశు సంపద అభివృద్ధికి సహకరించాలని కోరుతూ వారిలో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

సీతంపేట రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం యధావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తారని ఐటీడీఏ అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీఆర్ఎస్‌లో పీవో తో పాటు ఇతర శాఖల అధికారులు అందు బాటులో ఉంటారన్నారు.

జంతువులను సంరక్షించుకోవాలి



సీతానగరం: కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

పాలకొండ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జంతువులను సంరక్షించుకోవాలని జిల్లా పశు సంవర్థక శాఖాధికారి మన్మథరావు అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం పాలకొండ ఏరియా పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణా టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. 45 పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పశువైద్యశాల సహాయ సంచాలకుడు మాణిక్యరావు, వీరఘట్టం మండల పశువైద్య అధికారి చైతన్యశంకర్, పశు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు. ● సాలూరు రూరల్: జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జూనోసిస్ వ్యాధుల పట్ల పెంపకందారులు అవగాహన కలిగి ఉండాలని పశు సంవర్థక శాఖ సాలూరు సహాయ సంచాలకుడు గంగాధరరావు అన్నారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం సాలూరు పశువుల ఆసుపత్రిలో ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కుక్కలకు ఏఆర్‌వీ ఇంజక్షన్లు వేశారు. పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ● సీతానగరం: జంతువులను పరిరక్షించుకోవాలని పశు సంవర్థక శాఖ ఏడీ బి.శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా మండలంలోని సీతానగరం, నిడగల్లు, బగ్గందొరవలస పశు వైద్య కేంద్రాల్లో ఆదివారం పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాక్సిన్లు వేశారు. బగ్గందొరవలస మండల పశు వైద్యాధికారి ఎస్.రామారావు, బలిజిపేటలో పశు వైద్యాధికారి జి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రానికి దారేది?

మక్కువ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దుగ్గేరు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర పరిసరాలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. కనీసం కేంద్రంలోకి వెళ్లేందుకు దారి లేని విధంగా ఉంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున విషసర్పాలు సంచరించే ప్రమాదం ఉందని గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉప కేంద్రానికి వెళ్లేందుకు వీలుగా దారి కల్పించడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.



ఉపకేంద్రం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

నిలిచిన జలజీవన్ పనులు

భామిని, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగిడి సమీపంలో కొనసాగుతున్న జలజీవన్ మిషన్ పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. వంశధార నది గర్భంలో నిర్మిస్తున్న ఈ పనులను ఈ ఏడాది జూన్ 15వ తేదీలోగా పూర్తి చేయాల్సి ఉంది. కానీ పనులు నత్తనడకన సాగాయి. తాజాగా వంశధారలో పెరిగిన నీటి ప్రవాహంతో ఎక్కడ పనులు అక్కడ నిలిచిపోయాయి. తమ సామగ్రి కొంత భాగం నదీ గర్భంలో ఉందని ఆ సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరగడంతో కొంత సామగ్రిని సురక్షిత ప్రాంతానికి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు.

సంక్షేమ పథకాలపై టీడీపీ ప్రచారం

మక్కువ రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు, పీ-4 కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం కాశీపట్నం పంచాయతీ మేళాపువలస గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు గుళ్ల వేణుగోపాలనాయుడు పర్యటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఇంటింటికి వెళ్లి, సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహించారు. క్లస్టర్ ఇన్‌చార్జి పి.మల్లేశ్వరరావు, కాశీ పట్టణం మాజీ ఎంపీటీసీ కోట శంకరనాయుడు, యూనిట్ ఇన్‌చార్జి దాసరి కేశం, యామలపల్లి రవి, వెన్నెల జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

కురుపాం, జూలై 6(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం కురుపాంలో తెలుగు యువత అధికారి ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, అడహక్ కన్వీనర్ కేవీ కొండయ్య పర్యటించారు. ఇంటింటికి వెళ్లి, సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. కూటమి నాయకులు బలగ రామకృష్ణ, కరి శ్రీనివాసరావు, త్రినాథ పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమణ

గుమ్మలక్ష్మీపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ కోరారు. ఈ మేరకు ఆదివారం గుమ్మలక్ష్మీపురంలో సీఐటీయూ మండల కన్వీనర్ కె.గౌరీశ్వరరావు అధ్యక్షతన వివిధ రంగాల కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రమణ మాట్లాడుతూ అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు కనీస వేతనాలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

సాలూరు రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ శుక్లపక్ష శుద్ధ ఏకాదశి సందర్భంగా సాలూరు వైష్ణవాలయాల్లో ఆదివారం తొలి ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. సాలూరు రామాలయం, డబ్బి వీధి రామమందిరం, కల్యాణ వేంకటేశ్వరస్వామి, వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి తదితర ఆలయాల్లో పూజలు నిర్వహించారు.



పూజలు అందుకుంటున్న సీతారామ లక్ష్మణులు



పెదకోమటిపేటలో విష్ణు సహస్ర నామ పారాయణం చేస్తున్న మహిళలు

నాలుగు నెలల పారాయాణం

శయన ఏకాదశి సందర్భంగా చాతుర్మాస దీక్షలో భాగంగా పెదకోమటిపేట రామాలయంలో నాలుగు నెలల పాటు చేపట్టనున్న విష్ణు సహస్ర నామ పారాయణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. తొలుత మహావిష్ణువుకు పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి

సాలూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి సందర్భంగా పట్టణంలో ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదివారం సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర ప్రజలు క్షేమంగా ఉండాలని దేవున్ని కోరినట్టు తెలిపారు. ఆమె వెంట టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, హర్షవర్ధన్, కారేపు చంద్ర ఉన్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి

మక్కువ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వెంకటభైరిపురం గ్రామంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏకలవ్య జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గురువు లేకుండా విద్యాసాధనలో మేటి అయిన ఏకలవ్యుడు గొప్పతనాన్ని కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఏరుకుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గొర్లె పోలీస్, సుజాత, సంగమేష్, పాలవలస శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



ఏకలవ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



చెముదులో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దేశమ్మతల్లికి పూజలు

మక్కువ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చెముడు గ్రామంలో దేశమ్మ తల్లి వారాల పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి గద్దె వద్ద గ్రామస్థులంతా పూజలు నిర్వహించారు. అనంతరం మక్కువ రహదారి వైపు ఉన్న అమ్మవారి వనానికి ఊరేగింపుగా చేరుకున్నారు. మొక్కులు చెల్లించారు. టీడీపీ నాయకుడు భూషణరావు, సర్పంచ్ ప్రతినిధి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుగు రథయాత్ర

పాలకొండ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జగన్నాథస్వామి రథోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్వామివారి తిరుగు రథయాత్రను ఆదివారం వైభవంగా నిర్వహించారు. మారు దశమి రెండో రోజు సుభద్ర, బలభద్ర సమేతుడైన జగన్నాథస్వామి రథకంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం గుడించా మందిరం నుంచి బయలుదేరి పిన్నమగుడికి రథంపై చేరుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు మఠం విశ్వనాథదాస్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలకొండ పట్టణంతో పాటు సమీప గ్రామాల ప్రజలు తరలి వచ్చి రథాన్ని లాగి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ ఈవో సర్వేశ్వరరావు ప్రత్యేక పర్యవేక్షణ చేశారు.



భక్తులకు దర్శనమిస్తున్న జగన్నాథుడు



రథాన్ని లాగుతున్న భక్తులు